క్లుప్తంగా

దెబ్బతిన్న పంటల పరిశీలన


మినుము పంటను పరిశీలిస్తున్న ఏఓ విజయ్‌కుమార్

కొండపి: మండలంలో అధిక వర్షాలు కారణంగా దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారి డి. విజయ్‌కమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు పంట పొలాల్లో నిలిచిన నీటిని వెంటనే బయటకు పంపించాలని సూచించారు. మినుము పంటకు బూడిద రంగు తెగులు వ్యాపిస్తుందన్నారు. నివారణకు చర్యలుతీసుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు టి. వెంకటనారాయణ మరియు రైతులు పాల్గొన్నారు

మోడల్ టెస్ట్ పేపర్లు పంపిణీ


యూటీఎఫ్ మోడల్ టెస్ట్ పేపర్లతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

పీసీపల్లి: మండల పరిధిలోని నేరేడుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు యూటీఎఫ్ మోడల్ టెస్టు పేపర్లను హెచ్ఎం అంజినీదేవి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు పద్మావతి సొంత నిధులతో వీటిని అందజేశారు. అదే విధంగా పీసీపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మాదాసు రమేష్ రూ.5 వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు. ఎంఈఓలు సంజీవ్, శ్రీనివాసచారి, వేమూరు రామయ్య, సత్తిరెడ్డి, చిన్న బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం, వాహన చార్జీలు అందజేత


విద్యార్థులకు యూనిఫాం అంజేస్తున్న హెచ్ఎం

సీఎస్‌పురం(పామూరు): పేద విద్యార్థులకు దాతలు యూనిఫాం, పాఠశాలకు రాకపోకల కోసం వాహన చార్జీలు అందజేయడం కొనియాడదగినదని హెచ్ఎం మందాకుమారి అన్నారు. మండలంలోని సి.నాగులవరం జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో పాఠశాలలో చదువుతున్న మండలంలోని అగ్రహారానికి చెందిన ఎస్టీ విద్యార్థులకు పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ యర్రగుడ్డి ప్రభాకర్ యూనిఫాం, వారు నిత్యం పాఠశాలకు వచ్చేందుకు ఆటో చార్జీలకు రు.15 వేలు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని పేదవిద్యార్థులకు దాతలు సాయంగా నిలవడం శుభపరిణామమన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు హస్తి వీరాంజనేయులు, జవంగుళల వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ.9.05 లక్షలు

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం శనివారం ఆదాయం రూ.9,05,080 వచ్చినట్లు సహాయ కమిషనర్ కేవీ సాగర్‌బాబు తెలిపారు. అష్టోత్తరం ద్వారా రూ.6,700, కుంకుమార్చనకు రూ.21,600, తలనీలాలకు రూ.29,800, ప్రత్యేక దర్శనం రూ.2,27,200, రూం అద్దెలు రూ.25,620, లడ్డూ ప్రసాదాలు రూ.1,45,675, అన్నదానం రూ.4,22,869, విరాళాలు రూ.15,116, ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్ పేర్కొన్నారు.

గోకులం షెడ్లు ప్రారంభం

కందుకూరు రూరల్: మండలంలోని జిల్లెళ్ళమూడి, పలుకూరు గ్రామాల్లోని గోకులం షెడ్లను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. మినీ గోకులం షెడ్డు రూ.2.30 లక్షలతో నిర్మించారు. అందే విధంగా జిల్లెళ్ళమూడిలో రూ.10 లక్షలతో సీసీరోడ్డు, పలుకూరులో రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీడీఓ పి.రత్నజ్యోతి, కోవూరు పశువైద్యాధికారి సుదర్శి సుధాకర్, ఈసీ విజయ్ కుమార్, కార్యదర్శులు స్వప్న, మహబూబ్‌బాష, గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ నృసింహస్వామి

మర్రిపూడి: ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన పృధులగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నారాయణం మారుతీచార్యులు స్వామి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి పొంగళ్లను నైవేద్యంగా అందజేశారు.

మూగ రోదన పట్టదా..?

- అంతుపట్టని వ్యాధితో జీవాలు మృతి
- అందుబాటులో లేని పశు వైద్యులు
- కొలువు ఒకచోట..నెలవు మరో చోట
- అధికారుల తీరుపై పశుపోషకుల ఆగ్రహం


రోగాలతో మూలుగుతున్న మూగజీవాలు

మర్రిపూడి:

అంతుచిక్కని వ్యాధి సోకి మూగ జీతాలు మృత్యువాత పడుతున్నాయి. ఎండనకా, వాననకా, కంటికి రెప్పలా కాపాడుకుంటున్న జీవాలు తెలియని వ్యాధితో కళ్ల ముందే మృత్యువాత పడుతుండటంతో పశుపోషకులు తల్లడిల్లుతున్నారు. క్షేత్రస్థాయిలో రోగాన్ని గుర్తించి, తగు మందులు ఇచ్చి నయం చేయాల్సిన వైద్యులు అటుగా తొంగి చూసిన దాఖలాలు లేవు. ఉద్యోగం ఒక చోట, నివాసం మరొకచోట కావడంతో పశు పోషకులకు వైద్యం అందడం లేని వాపోతున్నారు.

పట్టించుకునేదెవరు..?

మండలంలో సుమారు గొర్రెలు 36 వేలు, మేకలు 16 వేలు, గేదెలు 19,000లు, ఆవులు, ఎద్దులు 1430 ఉన్నాయి. కాకర్ల, మర్రిపూడి గ్రామాల్లో పశువైద్యశాలలు ఉండగా, కూచిపూడి, తంగెళ్లలో ఉపపశువైద్యశాలలు ఉన్నాయి. అయితే పశువులకు ఎలాంటి జబ్బు చేసినా తగు మందులు వైద్యశాలలో దొరకడం లేదు. పశువులకు అవసరమైన మందులు కావాలని వైద్యశాలకు వెళితే వైద్యాధికారులు చీటీలపై రాసి ఇస్తున్నారని పోషకులు అంటున్నారు. పశువైద్యాధికారులు నివాసం ఒక చోట, విధులు మరోక చోట కావడంతో పశుపోషకులకు వైద్యం అందడం లేదు. వైద్య సిబ్బంది సైతం సక్రమంగా విధులు హాజరుకావడం లేదని, వచ్చినప్పుడు సమయపాలన పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. పశువులకు వైద్యం చేయాలంటే అటెండర్, లేదా గోపాలమిత్రలే ఇక్కడ దిక్కు అవుతున్నారన్నారు. వైద్యశాలలో కనీస వసతులు లేవు. గేదెలుకు వైద్యం చేసేందుకు ఉపయోగించే బోను పూర్తిగా విరిగిపోయింది. దీంతో చెట్టుకు కట్టేసి, క్రింది స్థాయి సిబ్బంది సహాయంతో వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మండలంలో పశు వైద్యాధికారులు కేవలం అలంకారప్రాయమే. గేదెలు ఏదైనా సమయంలో వేయాల్సిన సూదులు సైతం సక్రమంగా లేవని, దీంతో సూదు నిలవడం లేదని పశుపోషకులు వాపోతున్నారు. మందుల కోసం వైద్యశాలకు వెళితే పశు వైద్యశాలలో మందులు లేవని, ప్రైవేట్ మందుల దుకాణాల్లో తెచ్చుకోవాలని రాసి ఇస్తున్నారని పశు పోషకులు మండిపడుతున్నారు. జీవాలకు ముందుగా


నోటి జబ్బుతో బాధపడుతున్న గొర్రె

కాళ్ల నొప్పులు వచ్చి నడవలేకపోవడం, ముక్కు వెంట చీమిడి కారడం, నోరుపుండు పడటం, జొల్లు కారడం, మేత మేయకపోవడం, ఆ తర్వాత నీరసించి చలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కళ్ల ముందే ఒక్కొక్కటిగా చనిపోతున్న తరుణంలో మాచర్ల, ఒంగోలు, గుంటూరు తదితర పట్టణాలకు వెళ్లి మందులు కొనుగోలు చేసి తీసుకువస్తున్నామని వారు అంటున్నారు.

20 గొర్రెలు చనిపోయాయి:



నేను పెంచుకుంటున్న 20 గొర్రెలు తెలియని వ్యాధితో మరణించాయి. ఊరికి దూరంగా పడవేశా. మర్రిపూడి పశువైద్యశాలలో మందులు లేవనడంతో మాచర్ల వెళ్లి రూ.18 వేలు ఖర్చు చేసి గొర్రెలకు మందులు కొనుగోలు చేసి తీసుకొచ్చా. నాకు దాదాపు రూ.2 లక్షలు నష్టం వచ్చింది. వైద్యాధికారులు పట్టించుకోవడం లేదు:

కనకం రాజు, మర్రిపూడి

వైద్యశాలలో మందులు ఉండటం లేదు:



నాకు 20 గొర్రెలు ఉన్నాయి. వైద్యశాలకు ఎప్పుడు పోయినా మందులు లేవని అంటున్నారు. డాక్టర్ చీటీపై మందులు రాసి ఇస్తున్నారు. ప్రైవేట్ మందుల దుకాణంలోకి వెళ్లి తెచ్చుకోమంటున్నారు. మందులు కూడా లేనప్పుడు వైద్యశాలలు ఎందుకు.

బోనుబోయిన నరసింహారావు, మర్రిపూడి

మందులన్నీ అందుబాటులో ఉంచాలి:



పశువైద్య సిబ్బంది పశువులు పొలం వెళ్లాక వస్తున్నారు. 9 గంటల లోపు వైద్యశాలకు వస్తే పశువులకు వైద్యం చేయవచ్చు. తీరా పశువులు పొలం వెళ్లాక వచ్చినా ఉపయోగం ఏముంది.వైద్యశాలలో సౌకర్యాలు అంతంత మాత్రమే. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచి డాక్టర్ సమయపాలన పాటిస్తే మాకు ఇబ్బందులు ఉండవు.

వెంకట నరసింహారెడ్డి, మర్రిపూడి

■ చెరువులకు జలకళ


అలుగుపారుతున్న రేణిమడుగు చెరువు


అలురుపారుతున్న బోదవాడ చెరువు

పామూరు: మండలంలోని పలుగ్రామాల్లో గత 10 రోజులుగా వర్షాలు కురిశాయి. దీంతో మండలంలోని రేణిమడుగు, బోదవాడ, సిద్ధవరం చెరువులు అలుగుపారాయి. మండలంలోని మిగిలిన చెరువులకు నీరు చేరింది. మోపాడు మీడియం ఇరిగేషన్ చెరువుకు 11.2 అడుగుల మేర నీరు చేరింది.



అలుగుపారుతున్న సిద్ధవరం చెరువు

ప్రచార జాత విజయవంతం చేయండి


మాట్లాడుతున్న కిలారి వెంకటేశ్వర్లు

కందుకూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ప్రచార జాత విజయవంతం చేయాలని యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సన్నాహక సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ సోమవారం సాయంత్రం 5.30 గంటలకు కందుకూరు చేరుకుంటుందని ఆ జాతను ఈ ప్రాంత కార్యాకర్తలు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. జనవరి 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు జరుగుతాయని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎం.తిరుపతిస్వామి, సంక్షేమ పథక డైరెక్టర్ జి.శ్రీనివాసులు, మండల శాఖల అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.వెంకటేశ్వర్లు, జి.మాధవరావు, ఎం.మాధవ రావు, ఎస్.జాలయ్య, సీనియర్ నాయకులు ముప్పరాజు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాళ్లపాడు నీటిమట్టం 20.10 అడుగులు


నిండుకుండలా ఉన్న రాళ్లపాడు ప్రాజెక్టు

లింగసముద్రం: అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులుగా కురిసిన వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టు నీటిమట్టం శనివారం సాయంత్రానికి 20.10 అడుగులకు చేరినట్లు డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. మూడు రోజుల క్రితం ప్రాజెక్టు నీటిమట్టం 19.4 అడుగులు ఉండగా ప్రస్తుతం 20.10 అడుగులు నీరు వచ్చినట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1.1 టీఎంసీలు కాగా దాదాపు పూర్తిగా నీరు చేరినట్లు చెప్పారు. ప్రాజెక్టుకు 21 అడుగులు నీరు చేరిన అనంతరం కొత్తస్పీల్‌వే ద్వారా మన్నేరుకు నీటిని విడుదల చేస్తామన్నారు. ప్రాజెక్టు గేట్లు ఎత్తే అవకాశం ఉన్నందున దిగువ ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువులు, గొర్రెలు కాపరులు ఎవరూ మన్నేరులోకి దిగవద్దన్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు


చీర్లదిన్నెలో రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్


లింగంగుంట్లో రెవెన్యూ సదస్సులో అర్జీలు అందజేస్తున్న రైతులు


నందవనం సదస్సులో పాల్గొన్న మంత్రి స్వామి


రేగులచెలకలో అర్జీలు పరిశీలిస్తున్న అధికారులు

జరుగుమల్లి(సింగరాయకొండ): రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. జరుగుమల్లి మండలం నందనవనం గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ రీసర్వేలో ఎక్కువ మందికి ఇద్దరికి కలిపి ఒక ఎల్‌పిఎం నంబర్ ఇచ్చారని, ఎవరి నంబర్ వారికి విభజించి ఇవ్వాలని సూచించారు. సదస్సులో వచ్చిన అర్జీల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని, త్వరితగతిన సమస్య పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. రైతులు ఇచ్చిన అర్జీలను కలెక్టర్ స్వయంగా పరిశీలించి వారితో స్వయంగా మాట్లాడారు. ఆర్‌డీఓ లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ జనార్దన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండలంలోని లింగంగుంట్లో జరిగిన రెవెన్యూ సదస్సుకు 35 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ దిలీప్‌కుమార్ తెలిపారు. భూమి ఆన్‌లైన్ చేయాలని 24, ఆక్రమణదారుల పేర్లు తొలగించాలని 4, వ్యవసాయ భూమి కోసం 3, పొలానికి దారి సమస్య పరిష్కరించాలని 5 అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. మండల సర్వేయర్ కాకర్ల రమణయ్య, వీఆర్వో బెంజిమెన్, ఎంపీటీసీ కొడమల బెంజి తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు నిర్వహిస్తున్నట్లు గుండ్లకమ్మ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతి అన్నారు. మండలంలోని రేగులచిలకలో శనివారం తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతి, తహసీల్దార్లు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సదస్సులో మొత్తం 10 అర్జీలు రాగా ఆన్‌లైన్‌కోసం వచ్చాయి. మండల సర్వేయర్, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): మండలంలోని చీర్లదిన్నెలో జరిగిన రెవెన్యూ సదస్సుకు 17 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సీహెచ్ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యుటేషన్ కోసం 15, భూమి సర్వే చేయాలని 2 అర్జీలు వచ్చాయన్నారు. ఆర్ఐ పురుషోతంరెడ్డి, మండల సర్వేయర్ వైష్ణవి, వీఆర్వో, వీఆర్ఏ, ఈఎస్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న హెచ్ఎం, దాత

పామూరు: 10వ తరగతి విద్యార్థులు దాతలు అందజేసిన స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకుని వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని లక్ష్మీనరసాపురం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సయ్యద్ ఇసాక్ అన్నారు. మండలంలోని లక్ష్మీనరసాపురం జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో స్వయంకృషి స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు షేక్.నాయబ్‌రసూల్ సమకూర్చి అందజేసిన స్టడీ మెటీరియల్‌ను హెచ్ఎం ఇసాక్, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు విద్యార్థులకు అందజేశారు. ఇర్రి కోటిరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ పి.మస్తాన్‌రావు, రాచూరి ఏలియా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

సీఎస్‌పురం(పామూరు): అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీఓ జవహర్‌బాబుపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎంపీడీఓ మంచికంటి రంగసుబ్బరాయుడు అన్నారు. ఎంపీడీఓపై దాడిని నిరసిస్తూ శనివారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

పామూరు: అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీఓ జవహర్‌బాబుపై స్థానిక నాయకుల దాడి హేయమైన చర్య అని ఎంపీడీఓ బొలినేని సురేష్ అన్నారు. ఎంపీడీఓపై దాడిని నిరసిస్తూ శనివారం ఎంపీడీఓ కార్యాలయంవద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ నరసింహారావు, స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: ఎంపీడీఓ జవహర్ బాబుపై దాడికి నిరసనగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యాలయ సిబ్బంది బ్రహ్మయ్య, రమేష్, లక్ష్మణ్, గంగ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): నైపుణాభివృద్ధి శిక్షణకు ఈ నెల 30 నుంచి జనవరి 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కనిగిరి మునిస్పల్ కమిషనర్ డానియల్ జోసఫ్ ఒక ప్రకటనలో కోరారు. ప్లంబర్లు, కార్పంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీల మరమ్మతులు, గీజర్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ల మరమ్మతులకు శిక్షణ ఇస్తారన్నారు. పూర్తి వివరాలకు 7901610235, 8919820121 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అప్రకటిత విద్యుత్ కోతతో ఇబ్బందులు

కొండపి: కొండపి పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లో అప్రకటిత విద్యుత్ కోతతో ప్రజలు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా నిలిపివేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇలా ఎలా విద్యుత్ ను నిలిపివేస్తారని, కనీస సమాచారం ఇవ్వకుండా గంటల తరబడి విద్యుత్ సరఫరాను నిలిపివేయడం ఏంటని ప్రశ్నించారు. దీనిపై విద్యుత్ శాఖాధికారులను వివరణ కోరగా.పోలీస్ స్టేషన్‌లో సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ మారుస్తున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేశామన్నారు. భవిష్యత్‌లో ముందుగానే సమాచారం ఇస్తామని తెలిపారు.

డ్రోన్ కెమెరాలతో నేరాల నియంత్రణ


జిల్లా ఎస్పీకి డ్రోన్ అందజేస్తున్న దాత

టంగుటూరు: డ్రోన్ కెమెరాలతో క్షేత్ర స్థాయిలో నేర నియంత్రణకు అడ్డుకట్ట వేయవచ్చని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. టంగుటూరుకు చెందిన బీవీఎల్ ఎక్స్‌పోర్టు ప్రైవేట్ లిమిటెడ్ ఎంపీ బెల్లం జయంత్‌బాబు అత్యాధునిక డ్రోన్‌ను పోలీస్ శాఖకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ డ్రోన్ ద్వారా నేర నియంత్రణ, రద్దీగా ఉండే జంక్షన్లు పర్యవేక్షించడం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ వంటివి చేయవచ్చన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు, మార్కాపురం డీఎస్పీ నాగరాజు, సింగరాయకొండ సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఎస్సై నాగమల్లేశ్వరరావు, టంగుటూరు మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

కొండపి: స్థానిక సీతారామ కల్యాణ మండపంలో జరిగిన వైస్ ఎంపీపీ కోటరాజు కుమారుడు రామకృష్ణ, నాగదీప్తిల వివాహానికి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్‌రావు, పీడీసీసీబీ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొక్కిసం సుబ్బారావు, సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, మారెడ్డి వెంకటాద్రిరెడ్డి, మండవ మాల కొండయ్య, చింతల వెంకటేశ్వర్లు, అరికట్ల హరినారాయణ పాల్గొన్నారు.


వధూవరులను ఆశీర్వదిస్తున్న డాక్టర్ సురేష్, జూపూడి ప్రభాకర్‌రావు, డాక్టర్ వెంకయ్య

అనారోగ్యంతో ఆర్టీసీ బస్టాండ్‌లో చెన్నై వాసి మృతి


మృతి చెందిన చెన్నైవాసి

కొండపి: స్థానిక బస్టాండ్ ఆవరణలో చెన్నైకి చెందిన వ్యక్తి శనివారం మృతి చెందాడు. ఎస్సై ప్రేమ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..చెన్నైకి చెందిన వ్యక్తి పనుల నిమిత్తం జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామానికి వచ్చాడు. అనారోగ్యంతో వైద్యానికి స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వచ్చాడు. అయితే వైద్యులు ఒంగోలు జీజీహెచ్‌కు వెళ్లాలని సూచించడంతో బయటకు వచ్చాడు. ఆ తరువాత కొంత సేపటికి బస్టాండ్ ఆవరణలో పడిపోయి మృతి చెందాడు.